# మంత్రిగారి బంట్రోతు

నాకు బాగా జ్ఞాపకం... అప్పుడు నేను నాలుగో క్లాసులో వున్నాను. మా అక్కయ్య ఆరోక్లాసూ, అన్నయ్య ఎనిమిదో క్లాసూనూ. ఒకరోజు బొంబాయినుంచి మా మామయ్యొచ్చాడు హైదరాబాదుకి ఏదో పనుందని.

మా మామయ్య చాలా సరదా అయిన మనిషి, అస్తమానం ఏవో కబుర్లు చెబుతూ, నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు. ఆరోజు ఉన్నట్టుండి మమ్మల్ని ఒక ప్రశ్న అడిగాడు. "ఒరేయ్ రమేష్! పెద్దయ్యాక నీకేమవ్వాలని వుందిరా? యేం చదువుతావ్?" అని.

అన్నయ్య వెంటనే "నాకు ఇంజనీర్ అవ్వాలని వుంది మామయ్యా! ఇంజనీరయితే ఎన్నో అద్భుతమైన పన్లు చెయ్యొచ్చును. నీటిమీద వంతెనలు కట్టడం, గాలిలో ఎగిరే విమానాలను తయారుచెయ్యడం, ఇలా ఎన్నో బ్రహ్మాండమైనపన్లు చెయ్యొచ్చును" అన్నాడు. అవన్నీ ఊహించుకుంటూ మెరిసే కళ్ళతో అన్నయ్య. అదే ప్రశ్న అక్కయ్యనడిగాడు, "సుహా

సినీ నీ సంగతేమిటి? చదువుకోవాలనుందా లేకపోతే హాయిగా పెళ్ళిచేసు కుని పిల్లల్ని కంటూ, మొగుడికి వండిపెడుతూ వుండాలనుందా?" నేనూ అన్నయ్య నవ్వేశాం "సుహాకి పెళ్ళి చేసుకోవాలనే వుంది." అంటూ. "ఛీ! నేనేం పెళ్ళి చేసుకోను. నేను డాక్టరునవుతాను. పల్లెటూళ్ళకెళ్ళి, అక్కడున్న బీదవాళ్ళందరికీ ఉచితంగా వైద్యం చేస్తాను. మనదేశంలో డాక్టర్లందరూ ఎప్పుడూ సిటీలోనే వుంటారు. రోడ్డుకి కనీసం పది - పది హేను బోర్డులు కనిపిస్తాయి. పాపం కొన్ని కొన్ని పల్లెల్లో అసలు డాక్టర్లే ఉండరు. అర్జంటుగా డాక్టర్ని చూడాలంటే సిటీకి పోవాలి. ఈ లోపల ఒక్కొక్క సారి మందు సమయానికి అందక పేషంటు చచ్చిపోతాడు. అందులో లేడీడాక్టర్లు అసలేలేరు. అందుకని నేను డాక్టర్నవుతాను" అంది గుక్కతిప్పుకోకుండా.

"భేష్! మంచి ఉద్దేశ్యం. పట్టుదలతో చదివి మీరిద్దరూ ఇంజనీరు, డాక్టరు కావాలి. ఇప్పుడు చెప్పినట్టుగానే మంచి పన్లు చెయ్యాలి" అంటూ నాకేసి చూశాడు మావయ్య. "మరి నీ సంగతేమిట్రా-నువ్వేమవుతావ్ జగదీశ్?" అన్నాడు.

వెంటనే అక్కయ్య, అన్నయ్య, "వాడు పైలెట్ అవుతాడు మామయ్యా! వాడికి చిన్నప్పటినుంచి "ఎరోప్లేన్లు" అంటే సరదా. "అది నడపడం నాకెంతో ఇష్టం" అనేవాడు" అన్నారు.

"మీరుండండర్రా! వాణ్ణిచెప్పనీండి!" అన్నాడు మావయ్య.

అందరూ నాకేసి చూశారు 'మామయ్యా, నాకు మంత్రిగారి బంట్రో తును కావాలనుంది" అన్నాను, అదేదో తీరని కోరికలాగా మొహంపెట్టి. ఒక్క నిమిషం అందరూ మతిపోయిన వారిలాగ చూశారు నావంక.

"ఛీ!" అన్నాడు అన్నయ్య. "పిచ్చివెధవా? అదేం కోరిక" తిట్టింది అక్కయ్య. "అదేం కోరికరా! పోనీ మంత్రే అవచ్చుగా! మంత్రి గారి బంట్రోతేమిటి?" పెద్దగా నవ్వాడు మావయ్య. అన్నయ్య అక్కయ్య కూడా నవ్వుల్లో శ్రుతి కలిపారు. వారలా నవ్వుతూ వుంటే నాకు కోపం వచ్చింది. "ఎందుకు నవ్వుతారు? మీరు చెప్పినప్పుడు నేను నవ్వానా?" అన్నాను ఉక్రోషంగా, మామయ్య నవ్వడం మానేసి, "ఉండండ్రా! వాణ్ణి చెప్పనీయండి. "జగదీశ్ చెప్పమ్మా! నీకెందుకు మంత్రిగారి బంట్రోతు కావాలనిపించింది?" అన్నాడు.

"మరేమో, మామయ్యా, మొన్న నాన్నగారికేదోపనుంటే, ఒక మంత్రిగారి దగ్గరి కెళ్ళారు. ఇంట్లో అల్లరి చేస్తున్నానని చెప్పి అమ్మ "వీణ్ణి తీసుకుపోండి మీతోటి, ఛస్తున్నాను వీడి అల్లరి భరించలేక!" అంది విసుక్కుంటూ. నాన్న నన్ను తీసికెళ్ళారు. తోవలో చాక్లెట్టు కావాలని ఏడ్చాను "వెధవా! నువ్వెప్పుడు అంతే, వనున్నప్పుడు ఏదో కావాలని గొడవచేస్తావ్" అని తిట్టుకుంటూ, ఆటోని ఒక షాపు దగ్గర ఆపి, చాక్లెట్లు కొన్నారు. "ఇంత పొద్దున్నే ఎందుకు నాన్నా మంత్రిగారి దగ్గిరికి?" అడిగాను. "ఏడిశావులే! పొద్దున్నయితేనే వారు కలుస్తారు." "సాయంత్రం కలవరా?" మళ్ళీ అడిగాను. నేనెప్పుడూ ప్రశ్నలడిగి విసిగించడమూ తెలుసు. జవాబు చెప్పక తప్పదని తెలుసు నాన్నకి. అందుకే అన్నారు- "చూడు జగదీశ్! మంత్రి అంటే చాలా పెద్దవాడు. అతనికి రోజూ లక్షాతొంభై పన్లుంటాయి. సాయంత్రాలు అసలు ఖాళీవుండదు. ఏవో మీటింగులు ఉంటూ వుంటాయి" అన్నారు. అంతలో మంత్రిగారిల్లు వచ్చేసింది. ఆటోదిగి లోపలికెళ్ళాం. అప్పుడింకా ఎనిమిది కూడా కాలేదు. జనం హాల్లో నిండిపోయారు. "చచ్చాం అప్పుడే ఇంతమంది వచ్చేసారే!' అని విసుక్కున్నారు

నాన్న. ఒకమూల ఖాళీగా ఉంటే, అక్కడికెళ్ళి కూర్చున్నాం. అరగంట దాటింది. ఒకతను చక్కగా తెల్లప్యాంటూ, తెల్లకోటూ, ఎర్రని టోపీ, మెడలో క్రాస్‌గా ఎర్రని బాండూ వేసుకుని, ధగధగా మెరిసే ఇత్తడి బాడ్జిని తగిలించుకొని, కొచ్చి ఒక్కొక్కళ్ళకి నమస్కారం చేశాడు. మెల్లగా ఒకరూ ఒకరూ లేచి, ఏదో మాట్లాడుతున్నట్లుగా, అతని భుజం మీద చెయ్యి వేసి, అయిదూ, పదీ చేతిలో పెడుతున్నారు. అలాగే ఆ నోట్లని లెక్క పెట్టుకుంటూ జేబులో పెట్టుకుంటున్నాడు అతను. మెల్లిగా నాన్నకూడా లేచారు. ఇరవై రూపాయల నోటు తీసి అతనికిచ్చారు. అతను కళ్ళ కద్దుకుని, జేబులో పెట్టుకున్నాడు. అలా అందరి దగ్గరా తీసుకున్నాక లోపలికెళ్ళిపోయాడు. మరో అరగంటకల్లా వచ్చి ముందు నాన్నగారినే లోపలికి తీసికెళ్ళాడు. నేను ఇవతలే కూర్చున్నాను. పదినిమిషాలలో నాన్నగారు బయటికొచ్చేశారు. ఆ బంట్రోతుగారు కూడా నాన్న కూడా వొచ్చి "ఏమన్నారు సార్?" అన్నాడు. "నా ఫైల్ రేపు చూసి పంపిస్తానన్నారు," అన్నారు నాన్న. మీ ఫైలు రేపుదయమే అన్ని ఫైళ్ళకన్నా ముందుంచి టేబిలు మీద పెట్టేస్తాను. మీరేమీ వర్రీ కాకండి" అన్నాడు. "థాంక్స్ నరసింలూ? రేపొస్తాగా! దయచేసి ఆ పని చేసిపెట్టు లేకపోతే మంత్రిగారు మర్చిపోవచ్చును, అది నా ప్రమోషన్ ఫైలు" అన్నారు.

"అలాగే సార్! ప్రమోషన్ ఫైలా సార్! కంగ్రాచ్యులేషన్స్ సార్" అంటూ మళ్ళీ మెల్లగా చెయ్యి సాచీ సాచనట్టు సాచాడు నాన్న వెంటనే "థాంక్యూ" అంటూ మరో పదిరూపాయల నోటు చేతికిచ్చారు. నాకు ఆశ్చర్యం వేసింది. నాన్నొక్కరే ముప్పయి ఇచ్చారు. అక్కడ

కనీసం నూటయాభై మందైనా వున్నారు. అంటే నూటయాభై యింటూ ముప్పై ఈజ్ ఈక్వల్ టూ నాలుగువేల అయిదువందలయితే, నెలకి "ఒకలక్షా ముప్పయిఅయిదు వేలు." ఆ మాటే నాన్నతో అన్నాను. "అవున్నా! చదువెందుకు చెప్పుబండలు! ఎన్ని ఉద్యోగాలు చేసినా ఈ సంపాదన వుంటుందా? చెయ్యి సాచితే చాలు, రూపాయలు కురుస్తయ్" అన్నారు నాన్న "అలా ఇవ్వకపోతే మంత్రిగారి దర్శనం దొరకదు. ఈ లోపల పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది" అన్నారు. అప్పటినుంచి కన్ను మూసినా, కన్ను తెరిచినా మంత్రిగారి బంట్రోతు రూపమే కని పిస్తోంది. ఆ తరవాత ఒక రోజున అమ్మా, నాన్నా అంతా సినిమా కెళ్ళాం. ఇంటర్‌వెల్‌లో కూల్ డ్రింక్స్ కొందామని వెనక్కి తిరిగి చూశాము. అక్కడ ఆరురూపాయల టిక్కెట్టులో నర్సింలూ, అతని పిల్లలూ, ఒకావిడా కూర్చున్నారు. "అయిస్ క్రీం" తింటూ. నర్సింలు అప్పటి డ్రెస్‌లో లేడు. టెర్లిన్ పాంటూ, టెర్లిన్‌షర్టూ వేసుకున్నాడు. ఆవిడేమో బాగా మెరిసిపోయే చీర ఏదో కట్టుకుంది. చేతినిండా బంగారు గాజులూ, మెడసిండా గొలుసులే! కుఱ్ఱాడు జీన్స్ వేసుకున్నాడు. కూతురు సిల్కు మాక్సీ వేసుకుంది. వారి ముందర మేము ఎలాగో వున్నాము అమ్మ మెళ్ళో ఒక్క గొలుసైనా లేదు. చేతికి మట్టి గాజులే!

"ఎవరండీ వాళ్ళు?" అంది అమ్మ వాళ్ళతో మాట్లాడిన నాన్నతో.

"ఒక మంత్రిగారి బంట్రోతుగారు". అన్నారు నాన్న నవ్వుతూ.

"అయ్యో! ఏ ఆఫీసరో అనుకున్నాను" అంది ఆశ్చర్యంగా అమ్మ.

సినిమా అయిపోయాక మేము ఆటో కోసం నుంచున్నాం. నర్సింలూవాళ్ళు "హెరాల్డ్" కార్లో వెళ్ళిపోయారు.

అమ్మ అంది-"ఏమండి న్యాయం న్యాయం అని ఎందుకు పడిచా వడం ఇలా లంచాలు తీసుకున్నవాళ్ళు హాయిగా బతుకుతున్నారు. మనకి కంచంలో వచ్చేడి మెతుకులు రావడమే బ్రహ్మాండమైపోయె! ఎందుకొచ్చిన న్యాయమండీ! మీరూ లంచాలు తీసుకోకూడదూ..."

"ఛీ! నోరు మూసుకో! వాణ్ణి చూసి నీకూ అలాంటి ఆశ పుట్టింది? అటువంటి పాపపు సొమ్ము మనకొద్దే అయినా మనకెవరిస్తారు లంచాలు· ఆతనంటే మంత్రిగారి బంట్రోతు కాబట్టి!" అన్నారు.

"అయితే మంత్రిగారికెన్నిలంచాలొస్తాయి నాన్నా" అన్నాను నేను.

"నాకు తెలీదురా గొడవ" అంటూ ఆటో ఎక్కేశారు. నాకు లెక్కలు కట్టడం చేతకాలేదు. అసలే నేను లెక్కల్లో వీకు. ఒక్క మంత్రి గారి బంట్రోతు లెఖ్ఖే తెలిసింది రోజుకి ముప్ఫయి రూపాయిల చొప్పున నూటయాభయి మందికి ముప్ఫయి రోజులికీ... అందుకే మావయ్యా ఈ చదువులు గిదువులు నాకిష్టం లేదు. హాయిగా మంత్రిగారి బంట్రోతునై పోతాను. చక్కగా సంపాదిస్తాను" అన్నాను.

మావయ్యా అన్నయ్యా అక్కయ్యా అంతా మూగవారిలా వింటూ వొచ్చారు. కాస్సేపటికి తేరుకొని, మావయ్యన్నాడు- "ఒరే జగదీశ్! వాడు సంపాదించినదంతా పాపపు సొమ్మురా! ఎల్లకాలం నిలవదు. మంత్రిగారు పోగానే సంపాదన పోతుంది. ఊరికేవచ్చిన డబ్బుతో ఖర్చుకు అలవాటుపడ్డ వీళ్ళు ఉన్నదంతా ఖర్చుపెట్టేసి, అప్పుడు డబ్బులు రాలక మళ్ళీ మామూలుగానే బతుకుతారు. ఈ సంపాదనా దర్జా తాత్కాలికం కష్టపడి నీతిగా సంపాదించిన డబ్బే నిలుస్తుంది. పేరు ప్రతిష్ఠలను తెచ్చి

పెడుతుంది. అందుకని ఇలాంటి పిచ్చిపిచ్చి ఆలోచనలు మానేసి, హాయిగా, బాగా చదువుకో! పైలెట్‌వికా!" అన్నారు. ఈ సంగతి నాన్నకు చెప్పాడు మామయ్య. వెంటనే నాన్నగారు నన్ను ఊటీలో ఉన్న "లవ్ డేల్ స్కూల్"లో పెట్టారు బోర్డింగులో, ఈ వాతావరణానికి నేనేమైపోతానో నన్న భయంతో.

ం ం ం ం ం

ఇప్పుడు అన్నయ్య ఇంజనీర్ అయ్యాడు. అక్కయ్య డాక్టరు అయింది. నేను పైలెట్ అయ్యాను. ఒకరోజున రోడ్డుమీద కనిపించాడు నర్శింలు. పెరిగిన గడ్డం, చిరిగిన గుడ్డలూ నెరిసిన జుట్టు అడుక్కుతినే వాడిలా ఉంది రూపం. పావలా కాసు పడేద్దామని చేతులు జేబులోకి పెట్టుకున్న నేనువాడి మొహం చూసి ఆగిపోయాను. "నర్సింలూ నువ్వా!" అన్నాను.

"నువ్వెవరు బాబూ"? అన్నాడు.

"నేను... నేనే జగదీశ్‌ని, మా నాన్నగారు కాశీపతిరావుగారు. తన ప్రమోషన్ కోసం మంత్రిగారి దగ్గర నువ్వు పనిచేస్తున్నప్పుడు ఒచ్చారే అప్పుడు నేనూ ఒచ్చానుగా" అన్నాను.

"ఆ రోజులు పోయాయి బాబూ! మంత్రిగారే దిగిపోయారు. ఆళ్ళ వూళ్ళో వ్యవసాయం చేసుకుంటున్నారు ఆరిని నమ్ముకున్న నేను అతనితోనే వస్తానన్నాను. యవసాయంలో సాయం చెయ్యటానికి. "ఒద్దు లేరా లంచగొండికొడకా నువ్వొస్తే నన్నే మింగేస్తావ్" అన్నారు. "ఆరు మాత్రం తీసుకొలేదా బాబూ లంచం! మరినే చేసిన తప్పేంటి" అన్నాడు నర్సింలు. "నర్శింలూ, ఆయనైనా నువ్వైనా లంచం తీసుకోవడం మహా పాపం. ఈ లంచపు డబ్బు ఎవరి దగ్గరా నిలువదు సుమా?" అన్నాను. మామయ్య మాటలు జ్ఞాపకం చేసుకుంటూ.

"నిజమే బాబూ ఆ మంత్రిగారిక్కి కాన్సరంట! అట్టా సంపాదించిన డబ్బంతా మందులకి పోతోంది. ఇక నేనంటారా కష్టాల్లో మునిగున్నాను. నా పెళ్ళాం చచ్చిపోయింది. ఒక కొడుకు సదూకోమని కొట్టానని పారిపోయాడు. నా బిడ్డకి మంచి సంబంధం దొరకలేదు. సేతగాని సచ్చినోడు ఆ మొగుడు, ఇంటినిండా పిల్లలు. జీతంరాళ్ళు సరిపోవు. నా డబ్బంతా ఆళ్ళకి పెట్టి, నేనిట్టాగయ్యాను" అన్నాడు కంటతడిపెడుతూ.

ఇంతలో అక్కడికి చిక్కడ్‌పల్లి వెళ్ళే బస్సొచ్చింది. "వొస్తా బాబూ" అంటూ బస్సెక్కి వెళ్ళిపోయాడు. నాకు మాత్రం చిన్ననాడు నే చూసిన నర్సింలు రూపమే మనసులో మళ్ళీ మెదిలింది.